

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 24.0

పదేళ్ల తర్వాత తెరుచుకున్న సొసైటీ లాకర్లు

చేపల చెరువులకు.. అడ్డుకున్నా ఆగని చికెన్ వ్యర్థాలు

వేర్వేరు ప్రాంతాల్లో విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

కోడి పందేలపై పోలీసుల దాడి.. 11 మంది అరెస్ట్

- వివరాలు 5లో..




కల్యాణ వైభోగమే..

గోవిందా.. గోవింద.. ఆపదమొక్కుల వాడా.. అనాథ రక్షకా గోవిందా.. గోవింద అంటూ భక్తుల నామ స్మరణతో ద్వారకాతిరుమల, కాళ్లకూరు శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాలు ప్రతిధ్వనించాయి. ఆశ్వయుజ మాస కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. కల్యాణ ఘడియలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. - 4లో

పరిశుభ్ర భారత్ కావాలి

- కేంద్ర మంత్రి వర్మ.. స్వచ్ఛ అవార్డులు అందజేత
- గోదావరి జిల్లాల్లో విస్తరిస్తున్న క్యాన్సర్ : ఎంపీ పాకా

భీమవరం టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి):భారతదేశం అన్ని రంగాల్లోను ప్రపంచదేశాలతో పోటీ పడుతోంది. దీనితోపాటు ఆరోగ్యవంతమైన... పరిశుభ్ర భారత్ కావాలి. అందరూ మెచ్చే విధంగా పరిశుభ్రతలో దేశం తలమానికంగా నిలిపేందుకు ప్రజలు సహకరించాలి' అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి శ్రీనివాస్‌వర్మ పిలుపునిచ్చారు. భీమవరం కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ ప్రదానోత్సవం జరిగింది. రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ 'ఉభయ గోదావరిజిల్లాల్లో క్యాన్సర్ మహమ్మారి విస్తరిస్తోంది. వీటి నివారణకు ప్రతి ఒక్కరు ఆలోచన చేయాలి. పారిశుధ్య కార్మికుల సేవలకు మనమంతా రుణపడి ఉండాలి. ఆరోగ్యవంతమైన సమాజానికి ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలి' అని అన్నారు. 'స్వచ్ఛత అంటే ఒక్క రోజు పని కాదు. ప్రతి రోజు మనం కలిసి అనుసరించాల్సిన అలవాటు. దీని ద్వారా ఆరోగ్యవంతమైన, పచ్చని ఆంధ్రప్రదేశ్‌ను రూపొందించగలం' అని కలెక్టర్ నాగరాణి పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరు మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని అప్పుడే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవిస్తామని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. ప్లాస్టిక్ నిషేధాన్ని ప్రతి ఒకరు సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. భీమవరం మున్సిపాలిటీ స్వచ్ఛ మున్సిపాలిటీగా అవార్డు వచ్చినందుకు మున్సిపల్ కమిషనర్‌ను అభినందించారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

తాడేపల్లిగూడెంకు చెందిన వీర్నాల గౌరి కళా బృందం పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధం, మొక్కల పెంపకంపై ఇచ్చిన ప్రదర్శన అందరిని ఆకట్టుకున్నది. భీమవరం జి.ఎల్.బి మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు పరిసరాల పరిశుభ్రతపై ఇచ్చిన సందేశాత్మక ప్రదర్శన ప్రశంసలు అందుకుంది. భీమవరం మునిసిపాలిటీతో లయన్స్ క్లబ్ సంయుక్తంగా స్వచ్ఛత కార్యక్రమాల నిర్వహణకు అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏఎంసీ ఛైర్మన్ కలిదిండి సుజాత, కృష్ణబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ గంటా త్రిమూర్తులు, జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, ఏఎస్పీ వి.భీమారావు, మునిసిపల్ కమిషనర్, కె.రామచంద్రారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి వర్మ, ఎమ్మెల్యే అంజిబాబుల చేతుల మీదుగా స్వచ్ఛాంధ్ర అవార్డును స్వీకరిస్తున్న భీమవరం మునిసిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, ఇన్‌చార్జ్ హెల్త్ ఆఫీసర్ సోమశేఖర్, చిత్రంలో ఎంపీ పాకా, కలెక్టర్ నాగరాణి తదితరులు

మద్యం సేవించి బైక్ నడుపుతున్న ఇద్దరికి జైలు

భీమడోలు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి):మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇరువురు వ్యక్తులకు ఇరవై రోజులు జైలు శిక్ష విధించినట్లు భీమడోలు పోలీసులు తెలిపారు. ఈ నెల 6న భీమడోలు హైవే ప్రాంతాల్లో సీఐ విల్సన్, ఎస్ఐ సుధాకర్ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా దెందులూరు మండలానికి చెందిన గూడెల్లి జాన్‌బాబు, భీమడోలుకు చెందిన గండి వెంకట్రావు మద్యం సేవించి బైక్ నడుపుతుండగా తనిఖీల్లో పట్టుపడ్డారు. వీరిని కోర్టుకు తరలించగా ఒకొక్కరికి ఏలూరు స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కెవిఆర్ మహేశ్వరి 20 రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.



దసరా సరదాల్లో మద్యం కిక్

రూ.12.50 కోట్ల విక్రయాలు.. గత ఏడాదికంటే రూ.4 కోట్లు

పెరిగిన వైనం.. పండుగ పూట రహస్య అమ్మకాలు

భీమవరం క్రైం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి):దసరా పండుగ సరదాల్లో మద్యం కిక్ ఎక్కింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి నాలుగు కోట్ల రూపాయల అమ్మకాలు ఎక్కువ జరిగాయి. దసరా రోజు గాంధీ జయంతి కావడంతో మద్యం దుకాణాలు బంద్ అయ్యాయి. ఇవి తెరచి ఉంటే విక్రయాలు మరింత పెరిగేవని ఎక్సయిజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. గత ఏడాది ప్రభుత్వ మద్యం దుకాణాలే దసరాకు ఉండటంతో అంతంతమాత్రంగానే విక్రయాలు సాగాయి. గత ఏడాది ఎనిమిదిన్నర కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరగగా, ఈ ఏడాది జిల్లాలోని 195 మద్యం దుకాణాలకు 31 బార్లకు కలిపి పన్నెండున్నర కోట్లు విక్రయాలు జరిగాయి. దసరా రోజు దుకాణాలు బంద్ ఉన్నప్పటికీ కొన్నిచోట్ల రహస్యంగా అమ్మకాలు జరిగాయి. కొందరు క్వార్టర్‌కు రూ.80 నుంచి రూ.100 అదనంగా వసూలు చేశారు.

ఏలూరులోనూ జోరు

ఏలూరు జిల్లాలోనూ దసరా రోజుల్లో మందుబాబుల జోరు కొనసాగింది. ఈ జిల్లాలో 155 మద్యం షాపులు, 13 బార్లు ఉన్నాయి. వీటిల్లో ఈ ఏడాది 13 రోజులకు గాను రూ.49 కోట్లపైబడి మద్యం అమ్మకాలు సాగాయి. గత ఏడాది ఇదే రోజుల్లో రూ.35 కోట్లు అమ్మకాలు జరిగాయి. అంటే 14 కోట్లు అధికంగా విక్రయించారు.

స్వచ్ఛతకు శ్రీకారం..

దక్కింది పురస్కారం

కళకళలాడిన పచ్చదనం - 4లో

మద్యానికి బానిసై .. కడుపు నొప్పితో ఆత్మహత్య

ముదినేపల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై.. తనకు వచ్చిన రోగాన్ని నయం చేయించుకునే స్థోమత లేక ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం కొంత కాలంగా మద్యానికి బానిసైన ముదినేపల్లి మండలం వణుదుర్రుకు చెందిన బొర్రా వీరవెంకటేశ్వరరావు (54) కొద్ది రోజులుగా తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించేందుకు ఆర్థిక స్తోమత లేక స్థానికంగా చికిత్స పొందుతున్నాడు. ఈ నెల 3న కడుపు నొప్పిని భరించలేక దోమల మందు తాగేశాడు. ఇది చూసిన కుమారుడు తండ్రిని గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ ఈ నెల 5న మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన రిపోర్టు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ముదినేపల్లి పోలీసు స్టేషన్ హెచ్‌సీ ఎస్.వి.రామారావు తెలిపారు.

పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై దృష్టి



బాధితుల గోడు వింటున్న ఎస్పీ నయీం

భీమవరం టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి):'పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రతిరోజు విధిగా కొంత సమయం కేటాయించాలి. క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరించాలి' అని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి సూచించారు. వివిధ సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి వచ్చిన 168 అర్జీలను సోమవారం కలెక్టరేట్‌లో స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, ప్రజలు సమర్పించిన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. నిర్లక్ష్యానికి తావు లేకుండా సమష్టిగా పనిచేయాలని సూచించారు. డీఆర్వో బి.శివన్నారాయణరెడ్డి, డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు, వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు అర్జీలను స్వీకరించారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జేసీ రాహుల్

ఎస్పీ కార్యాలయంలో 16 అర్జీలు

భీమవరం క్రైం : ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ అర్జీలు తిరిగి పునరావృతం కాకుండా నిర్ణీత గడువులోగా శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, భర్త/అత్తారింటి వేధింపులు, భూ-ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధికవడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమపేరుతో మోసం, ఆస్తి తగాదాలు, ఇతర సమస్యలపై మొత్తం 16 అర్జీలను ఎస్పీ స్వీకరించారు. ఏఎస్పీ వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కేవీవీఎన్ సత్యనారాయణ, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

10న భీమవరంలో పింఛన్ అదాలత్

భీమవరం టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి):భీమవరం ఎస్ఆర్‌కేఆర్‌కే ఆడిటోరియంలో ఈ నెల 10వ తేదీ ఉదయం పది గంటలకు ఏపీ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతి ప్రియ ఆధ్వర్యంలో పింఛన్ అదాలత్ జరగనుందని జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం సర్వీసులో వున్నవారు, రిటైర్డ్ ఉద్యోగులు ఈ కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చు. జిల్లా అధికారులు తమ పరిధిలోని ఉప కార్యాలయాలకు సమాచారం అందించి వారి సమస్యల పరిష్కారానికి పెన్షన్ అదాలత్‌కు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న పింఛను మంజూరు, జీపీఎఫ్, మిస్సింగ్ క్రెడిట్ వంటి అన్ని సమస్యలను ఈ పింఛన్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

దానేశ్వరి హుండీ ఆదాయం రూ.7.76 లక్షలు

తణుకు రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి):దువ్వ దానేశ్వరి అమ్మవారి హుండీ ఆదాయం 60 రోజులకు రూ.7 లక్షల 76 వేల 921 లభించినట్లు ఆలయ ఈవో శ్రీధర్ తెలిపారు. సోమవారం ఆలయంలో తణుకు డివిజన్ దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జీఎస్‌వీ ప్రసాద్ పర్యవేక్షణలో హుండీ ఆదాయం లెక్కించారు. ఆలయ ఛైర్మన్ పత్తి రామకృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



జగన్మోహినిగా.. శ్రీవారు

ద్వారకాతిరుమల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మోహినీ అలంకారంలో శ్రీవారు సోమవారం భక్తజనులకు దర్శనమిచ్చారు. చిన వెంకన్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముగ్ధ మనోహర రూపలావణ్యాలతో జగన్మోహినిగా భక్తులను కటాక్షించారు. క్షీరసాగర మదనంలో ఉద్భవించిన అమృతాన్ని దేవ, దానవులకు పంచేందుకు గాను శ్రీమహావిష్ణువు స్త్రీ రూపంలోకి మారారు. ఈ అలంకరణను అధిక సంఖ్యలో భక్తులు దర్శించి తరించారు.

సింహ వాహనంపై రాజసం

సింహవాహనంపై అలివేలు మంగ, అండాళ్ అమ్మవార్ల సమేతంగా కొలువైన దేవదేవుడు సోమవారం క్షేత్ర తిరు వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అభయహస్తాన్ని ఇస్తున్న శ్రీవారికి నీరాజనాలు సమర్పించారు. స్వామి, అమ్మవార్లను భక్తులు కొలిచారు. దుష్టజన సంహారానికి, భక్తజన సంరక్షణకు సంకేతంగా స్వామి సింహవాహనంపై ఊరేగారు.



కల్యాణ వేదికపై స్వామి, అమ్మవార్ల కల్యాణమూర్తులకు హారతులిస్తున్న అర్చకులు, కల్యాణవేదిక వద్దకు స్వామి, అమ్మవార్ల రాక, పట్టువస్త్రాలు తెస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి, ట్రస్టీ విప్పతరావు, ఈవో మూర్తి

కల్యాణం.. కమనీయం

- వైభవంగా చిన వెంకన్న కల్యాణం
- ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే
- శేషాచలంపై బ్రహ్మోత్సవ శోభ

ద్వారకాతిరుమల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): చిన్న తిరుమలేశుని కల్యాణవైభోగాన్ని వీక్షించే... ఆ కనులదే ఎంతో భాగ్యం.. ఈ వేడుక కమనీయం.. రమణీయం. సిగ్గులొలుకుతున్న అలివేలు మంగ, అండాళ్ అమ్మవార్లను సర్వాభరణ భూషితుడై తేజోవిరాజితుడైన శ్రీవారు.. శుభముహూర్త సమయాన పరిణయమాడారు. కల్యాణ ఘడియలో స్వామివారి దివ్య మంగళ స్వరూపాన్ని వీక్షించిన భక్తులు తరించారు. దేవదేవుని కల్యాణ ఘట్టం ఆవిష్కృతమైన వేళ భక్తజనుల మది ఆనంద పారవశ్యంతో నిండింది. భక్తులు గోవిందా.. గోవిందా.. అంటూ తన్మయత్వంలో మునిగారు. ఈ అద్భుత దృశ్యం ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల వాసుని ఆలయంలో సోమవారం రాత్రి ఆవిష్కృతమైంది.

వేర్వేరు తెళక్క వాహనాలపై శ్రీవారు, అమ్మవార్లను ఉంచి అలంకరించారు. ఆలయ తూర్పుగోపుర సమీపంలో వేదిక దగ్గరకు తెచ్చారు. వేదికను పచ్చిపూలతో, కళాసౌందర్యాలతో అలంకరించారు. వేదికపై బంగారు సింహాసనంపై కల్యాణమూర్తులను ఉంచి అలంకరించి అర్చకులు కల్యాణతంతును ప్రారంభించారు.

పాంచాహ్నిక దీక్షతో వైఖానస ఆగమాన్ని అనుసరించి జరిగిన ఈ కల్యాణతంతులో భాగంగా ఆలయ అర్చకులు ముందుగా విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచన, రక్షాబంధన ఆరాధన చేశారు. స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. రాష్ట్రప్రభుత్వం తరపున ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు అందించారు. ఆలయ చైర్మన్ రాజా ఎస్వి సుధాకరరావు, ఈవో ఎస్వీ సత్యనారాయణమూర్తి దేవస్థానం తరపున కల్యాణమూర్తులకు పట్టువస్త్రాలను అందజేశారు. అర్చకులు కల్యాణమూర్తులకు మధుపర్కాలను సమర్పించారు. సుముహూర్త సమయంలో జీలకర్ర, బెల్లం ధరింపచేసి భక్తుల గోవిందనామ స్మరణల నడుమ మాంగల్యధారణ, తలంబ్రాలు వైభవోపేతంగా జరిపించారు.



కన్నుల పండువగా కాళ్లకూరు వెంకన్న కల్యాణం

కాళ్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గోవింద నామస్మరణతో కాళ్లకూరు గ్రామం మారుమోగింది. వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆశ్వయుజ మాస లఘు (చిన్న) కల్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. మరంగంటి ఝాన్సీలక్ష్మీ కుమారులతో ఆలయ అర్చకులు, వేద పండితులు అనిపెద్ది ఫణికుమార్ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ అత్యంత వైభవంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణ మహోత్సవ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఎం.అరుణ్‌కుమార్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం



నరసాపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న సబ్ కలెక్టర్ కార్యాలయం పరిశుభ్రతకు మారుపేరు. నిత్యం చెత్త తొలగించడంతో పాటు మూడో శనివారం క్రమం తప్పకుండా స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించి ఉద్యోగులకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. కార్యాలయ ప్రాంగణం పరిశుభ్రత, పచ్చదనంతో కనిపిస్తుంది. మొక్కలు పెంపకం, కార్యాలయంలో పరిశుభ్రత తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ఈపురస్కారం ఇచ్చారు

జిల్లా పరిషత్ కార్యాలయం



ఏలూరు సిటీ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాల విభాగంలో జడ్పీ కార్యాలయానికి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు లభించింది. కార్యాలయ ఆవరణలో పచ్చదనం - పరిశుభ్రత, లోపల కూడా పరిశుభ్రంగా ఉండడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి పలు అంశాలను పరిగణనలోకి తీసుకుని స్వచ్ఛ అవార్డును ప్రకటించారు. పరిశుభ్రతతో అవార్డు పొందడంలో ఉద్యోగుల కృషి ఎంతో ఉందని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, సీఈవో ఎం.శ్రీహరి చెబుతున్నారు.

ఏకలవ్య పాఠశాల.. విప్పలపాడు



బుట్టాయగూడెం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): విప్పలపాడులో గిరిజన సంక్షేమ ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాల రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ ఆంధ్ర అవార్డు కైవసం చేసుకుంది. పాఠశాల పరిసరాలను, వసతి గృహాలు, ఆటస్థలం, డ్రెయిన్లు, రోడ్లను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు విద్యార్థులు పరిశుభ్రత పాటించేలా ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ మిశ్రా చర్యలు తీసుకున్నారు. పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

జిల్లా కేంద్ర ఆస్పత్రి.. తణుకు



తణుకు, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): తణుకులోని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి జిల్లా స్థాయి స్వచ్ఛతా అవార్డుకు ఎంపికైంది. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడంతో అవార్డు దక్కింది. ప్రధానంగా ఎల్‌బో ట్యాప్‌లు, సోప్ బాక్సులు, బయో స్టెరిలైజ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాల్లో ఉత్తమంగా తణుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నిలిచినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయి కిరణ్ తెలిపారు.

స్వచ్ఛ పురస్కారం సాధించిన

పరిశుభ్రత - పచ్చదనం

- స్వచ్ఛతకు ప్రభుత్వం ప్రాధాన్యం
- అవార్డులతో ప్రోత్సాహం
- మునిసిపాలిటీలు, పంచాయతీలు, అంగన్‌వాడీలు, ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాల్లో శుభ్రతకు పెద్దపీట
- వ్యక్తిగత పురస్కారాలతో పాటు కార్యాలయ విభాగంలో అవార్డులు

మునిసిపాలిటీ అంటే అపరిశుభ్రతకు అనే అపప్రద నుంచి స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టి పరిశుభ్రతలో అవార్డులు అందుకునే స్థాయికి ప్రభుత్వం ప్రోత్సహించింది. పంచాయతీలు ఇంటింటా చెత్త సేకరించి పారిశుధ్యం మెరుగుపరచడంతో పాటు ఆదాయం పెంచుకునే దశగా చర్యలు తీసుకున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ వసతి గృహాలు, ఆస్పత్రులు, బస్టాండ్‌లు, ప్రభుత్వ కార్యాలయ ఆవరణ అద్దంలా మెరిసేలా తీర్చిదిద్దడంతో ప్రభుత్వం అవార్డులు అందజేసి ప్రోత్సహించింది. అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచడంతో పాటు బాలింతలు, గర్భిణులకు శుభ్రత, ఆహారంపై అవగాహన కల్పించారు. చిన్నారులకు చేతుల పరిశుభ్రత, ఆరోగ్య సూచనలతో మెరుగైన ఫలితాలు సాధించారు. అవార్డులు అందుకున్న పలు సంస్థల పరిచయం..

పచ్చని పంచాయతీలు



కామయ్యపాలెం సంపద కేంద్రం

జీలుగుమిల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో పి.అంకంపాలెం, కామయ్యపాలెం పంచాయతీలు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చి రాష్ట్ర, జిల్లా అవార్డులు దక్కించుకున్నాయి. పి.అంకంపాలెం నుంచి ఎన్.సూరమ్మ రాష్ట్రస్థాయి గ్రీన్ అంబాసిడర్‌గా ఎంపిక కాగా, కామయ్యపాలెం పంచాయతీ జిల్లా స్థాయి అవార్డు దక్కించుకుంది.

కామయ్యపాలెం పంచాయితీలో పారిశుధ్య చర్యలతోపాటు గ్రామంలో పలు అంశాలపై స్థానికుల్లో అవగాహన కల్పించారు. గ్రామాల్లో చెత్త కనిపించకుండా వీధుల్లో చెత్త డబ్బాలు ఏర్పాటు చేశారు. తడి పొడి చెత్తను వర్మి తొట్టిల్లో వేసి వర్మి తయారు చేశారు. తయారైన ఎరువు అటవీశాఖ అధికారులకు అమ్మడంతోపాటు వాటిని నర్సరీలకు తరలించే చర్యలు తీసుకున్నామని ఎంపీడీవో టి.నిఖిల్ మధు శరణ్ తెలిపారు.

పాలకోడేరు: మండలంలోని విస్సాకోడేరు, వేంద్ర పంచాయతీలు స్వచ్ఛ పురస్కారాలు అందుకున్నాయి. పారిశుధ్యం మెరుగుదల, ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాల నిర్వహణలో శ్రద్ధ వహించాయి. ఇంటింటా తడి, పొడి చెత్త సేకరించి డంపింగ యార్డుకు తరలించడంతో గ్రామాలు పరిశుభ్రంగా మారాయి. వేంద్ర సర్పంచ్ కడలి నాగేశ్వరి, కార్యదర్శి కృష్ణమోహన్, విస్సాకోడేరు సర్పంచ్ బొల్లా శ్రీనివాస్, కార్యదర్శి పవన్‌కుమార్‌ను గ్రామస్తులు అభినందించారు.

నిడమర్రు: జిల్లా స్థాయి ఉత్తమ స్వచ్ఛ పంచాయతీగా ఛానమిల్లి గ్రామ పంచాయితీ ఎంపికయ్యింది. సంపద సృషి కేంద్రాలు, వ్యక్తిగత మరగుదొడ్ల నిర్వహణ, తడి, పొడి చెత్త సేకరణ, వర్మీ కంపోస్టు తయారీ అంశాలతో జిల్లా స్థాయిలో ఉత్తమ స్వచ్ఛ పంచాయతీగా ఛానమిల్లి గుర్తింపు పొందడం ఎంతో ఆనందంగా ఉందని సర్పంచ్ నంద్యాల ప్రసాద్, కార్యదర్శి మామిడూరి సంజీవరావు అన్నారు. ఈ అవార్డు మాకు మరింత పోత్సాహంగా ఉందన్నారు.

ఆకివీడు రూరల్: జిల్లా స్వచ్ఛ పంచాయతీగా సిద్ధాపురం పంచాయతీ అవార్డు అందుకుంది. గ్రామానికి చెత్త ట్రాక్టరు, పారిశుధ్య కార్మికులు ద్వారా తడిపొడిచెత్తను విడివిడిగా సేకరించి డంప్ చెయ్యడం, వర్మీకంపోస్టు తయారు చెయ్యడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధించడం వంటి కార్యకలాపాలు క్రొత్త పద్దతులలో నిర్వహించి ఆదర్శంగా నిలవడం వలన అవార్డు పొందినట్లు కార్యదర్శి సతీష్ తెలియజేశారు. ప్రజల సహకారంతో అవార్డు రావడం ఆనందంగా ఉందని తెలిపారు.

తణుకు రూరల్: మండలంలోని తేతలి, కోనాల గ్రామ పంచాయతీలు జిల్లా స్థాయి స్వచ్ఛ అవార్డులు పొందాయి. బహిరంగ ప్రదేశాల్లో పరిసరాల పరిశుభ్రత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, స్థిర వ్యర్థాల నిర్వహణలో కొత్త ప్రమాణాలు పాటించడం వంటి అంశాల ఆధారంగా తేతలి గ్రామ పంచాయితీకి, ఉత్తమ గ్రీన్ అంబాసిడర్ విభాగంలో తేతలి గ్రామానికి చెందిన బచ్చల రామచంద్రం, స్వచ్ఛ అంగన్‌వాడీల విభాగంలో కోనాలకు చెందిన డి.లక్ష్మి సుజాతను అవార్డులు వరించాయి.



విస్సాకోడేరు, వేంద్ర పంచాయతీలు



ఏలూరు, భీమవరంలో పారిశుధ్య నిర్వహణ

మునిసిపాలిటీలు పరిశుభ్రం

ఏలూరు టూటౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఏలూరు నగర పాలక సంస్థ కార్యాలయాన్ని స్వచ్ఛాంధ్ర అవార్డు వరించింది. ప్రభుత్వ కార్యాలయాల స్వచ్ఛత కేటగిరిలో లభించింది. ప్రతీరోజు మరుగుదొడ్ల శుభ్రంగా ఉంచడం, హ్యాండ్‌వాషింగ్ సౌకర్యం కల్పించడం, తడి, పొడి చెత్తకు వేర్వేరు డస్ట్‌బిన్‌లను కార్యాలయంలో ఉంచడం ద్వారా పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చారు. సిబ్బందికి పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఎంప్లాయిస్ ఫీడ్‌బ్యాక్‌తో అవార్డు అందుకున్నారు. అవార్డు లభించడంపై మేయర్ షేక్ నూర్జహాన్, కమిషనర్ భానుప్రతాప్ ఆనందం వ్యక్తం చేశారు.

భీమవరం టౌన్: స్వచ్ఛ మునిసిపాల్టీల విభాగంలో భీమవరం మునిసిపాల్టీ అవార్డు అందుకుంది. 39 వార్డుల్లో ఇంటింటి నుంచి వాహనాల ద్వారా చెత్త సేకరణ, తడి, పొడి చెత్తను వేరు చెయ్యడం, స్వచ్ఛతా హి సేవా-2025 లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించడం అంశాలతో అవార్డు అందిపుచ్చుకుంది. పట్టణంలో ప్లాస్టిక్ నిషేధాన్ని పూర్తి స్థాయిలో అమలకు తీసుకున్న చర్యలు, వ్యాపారులతో సమావేశాలు ఏర్పాటు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు ఇతర మునిసిపాల్టీలకు ఆదర్శంగా నిలిచి ఈ వార్డును దక్కించుకుంది.

జంగారెడ్డిగూడెం: స్వర్ణాంధ్ర, సచ్ఛాంధ్ర కార్యక్రమాల అమలులో జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీ జిల్లా ప్రథమస్థానం సాధించింది. డంపింగ్ యార్డులో చేపట్టిన వ్యర్థాల నిర్వహణతో ఉత్తమ ఫలితాలు సాధించారు. 3 నెలల్లో 18,736 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను రీసైక్లింగ్ చేశారు. ప్రతీ రోజు ఇళ్ల నుంచి చెత్త సేకరణ, ప్లాస్టిక్, తడి, పొడి చెత్తపై మునిసిపల్ కమిషనర్ కెవి.రమణ ప్రజలకు అవగాహన కల్పించడం మంచి ఫలితాలు ఇచ్చింది.



నరసాపురం పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహం

అద్దంలా మెరిసిన వసతి గృహాలు

నరసాపురం రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాయపేట బీసీ వసతి గృహం పరిశుభ్రతకు మారు పేరు. విద్యార్థులకు స్వచ్ఛాంధ్రపై పూర్తి అవగాహన కల్పించారు. బాత్‌రూమ్‌లు, టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉంచడం, చెత్త నిర్వహణ, ఆర్వో వాటర్, మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడంలో వసతి గృహం ముందంజలో ఉంది. స్టేషన్‌పేటలో సాంఘిక సంక్షేమ వసతి గృహం విద్యార్థులు ప్లాస్టిక్ కవర్ల దూరం చేశారు. స్వచ్ఛాంధ్రను క్రమం తప్పకుండా పాటిస్తారు. చెత్తనంతా డస్ట్‌బిన్‌లో వేస్తున్నారు. పదికిపైగా డస్ట్‌బిన్‌లు పెట్టారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచారు. నీరును వృథా చేయరు. ఆరోగ్యం, వ్యాయామం, చదువు, హాస్టల్ నిర్వహణలో విద్యార్థులు భాగస్వామ్యం అవుతున్నారు.

నిడమర్రు: మండలంలోని పెదనింద్రకొలను సాంఘిక సంక్షేమ వసతి గృహం ఉత్తమ స్వచ్ఛ వసతిగృహంగా ఎంపికైంది. వసతి గృహం భవనం, టాయిలెట్స్, గదుల నిర్వహణ, వంట గది పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై వసతి గృహం అధికారి జీబీ.కళ్యాణి ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకున్నారు. అవార్డుకు ఎంపికవుతామని ఊహించలేదని, అవార్డు మరింత బాధ్యతను పెంచిందన్నారు. వసతి గృహ పరిసరాలు, విద్యార్థులు శుభ్రత పాటించడంలో ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తామని కళ్యాణి తెలిపారు.

అంగన్‌వాడీల్లో ఆరోగ్యం



అంబర్‌పేట అంగన్‌వాడీ

భీమడోలు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉత్తమ స్వచ్ఛ అంగన్‌వాడీ కేంద్రంగా అంబరుపేట 16వ నెంబరు కేంద్రం ఎంపికైంది. అంగన్‌వాడీ కార్యకర్త బి.సంతోషమ్మ నిర్వహణలో బాలింతలు, గర్భిణులకు వంటగది పరిశుభ్రత, పౌష్టికాహార నియమాలు, వంటకాలు నేర్పించడంలో శ్రద్ధ వహించారు. చిన్నారులకు భోజనం ముందు తరువాత చేతులు శుభ్రత నియమాలను నేర్పించారు. కేంద్రం ఆవరణలో తడి చెత్త, పొడిచెత్తను గ్రామ పంచాయతీకి అప్పగించడం, కూరగాయలు, ఆకుకూరలు పెంచడం, వినియోగించడం వంటి కార్యక్రమాలు ఈ కేంద్రానికి జిల్లా స్థాయిలో అవార్డు రావడానికి దోహదపడ్డాయి.

పాలకోడేరు: మండలంలోని మైప అంగన్‌వాడీ కేంద్రం స్వచ్ఛాంధ్ర పురస్కారంతో మెరిసింది. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పెరట్లోనే కూరగాయల మొక్కలు పెంచి పిల్లలకు ఆహారంగా వండి పెడుతున్నారు. ఆవరణ పచ్చదనం, పరిశుభ్రతతో తీర్చిదిద్దిన అంగన్‌వాడీ కార్యకర్త జ్యోతిలక్ష్మిని గ్రామస్తులు అభినందిస్తున్నారు.

ద్వారకాతిరుమల: మండలంలోని తిరుమలంపాలెం-2 అంగన్‌వాడీ కేంద్రం టీచర్ షేక్ సుల్తానబీ నిర్వహణలో జిల్లా స్థాయి అవార్డు సాధించింది. తడి, పొడి చెత్త నిర్వహణ, పరిశుభ్రత, సురక్షితమైన త్రాగునీరు, పిల్లల వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, ఆరోగ్యకరమైన ఆహారం అంశాల్లో అవార్డు సాధించినట్లు సీడీపీవో బ్యూలా పరిమి, సూపర్‌వైజర్ మేరీ తెలిపారు. అంగన్వాడీ కేంద్ర పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం, కిచెన్, టాయిలెట్లు పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. పిల్లలు, సిబ్బంది భోజనానికి ముందు తర్వాత చేతులు కడుక్కునే అలవాటును ప్రోత్సహించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు రక్షిత తాగునీరు అందేలా చర్యలు తీసుకున్నారు.

భీమవరం రూరల్: రాయలం అంగన్‌వాడీ కేంద్రం స్వచ్ఛ అంగన్‌వాడీగా ఎంపికైంది. చిన్నారులకు పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పారు. ఆకుకూరలు స్వయంగా పండించి పౌష్టికాహారంగా చిన్నారులకు అందించడం జరిగింది. ఇలాంటి అంశాలు పరిగణనలోకి తీసుకుని స్వచ్ఛంధ్ర అవార్డులు అందించింది. భీమవరం పట్టణంలోని ఝాన్సీలక్ష్మీబాయి మునిసిపల్ బాలిక పాఠశాల స్వచ్ఛ ఆంధ్ర అవార్డుకు ఎంపికైంది. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా విద్యార్థినులు పరిశుభ్రతకు సంబంధించినవి పాటించడం, వంటశాల, ఆహారం అందించడంలో పరిశుభ్రత పాటించటం వంటి వాటిపై అవార్డు వరించింది.

దెందులూరు: మండలంలోని కొవ్వలి అంగన్వాడీ కేంద్రం ఉత్తమ పురస్కారం అందుకుంది. మరుగుదొడ్ల నిర్వాహణ, వ్యక్తిగత శుభ్రత, వంటశాల శుభ్రతపై దృష్టి సారించారు. పిల్లలు ప్లాస్టిక్ వాడకుండా చర్యలు తీసుకోవడంతో స్వచ్ఛ అంగన్వాడీ కేంద్రం అవార్డు ప్రకటించడం చాలా సంతోషంగా ఉందని అంగన్వాడీ టీచర్ కె.దేవి, సూపర్‌వైజర్ శ్రీదేవి ఆనందం వ్యక్తం చేశారు.



కొవ్వలి అంగన్‌వాడీ కేంద్రం

స్వచ్ఛ బస్టాండ్లు



ఏలూరు కొత్త బస్టాండ్

ఏలూరు

ఏలూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఏలూరు బస్ డిపో స్వచ్ఛ బస్టాండ్‌గా అవార్డు అందుకుంది. బస్టాండ్ ఆవరణ శుభ్రత, టాయిలెట్లు పునరుద్ధరణ, 3 సీటర్ కుర్చీల ఏర్పాటు, 15 కొత్త ఫ్యాన్లు బిగించి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించారు. ఆర్వో వాటర్ ప్లాంట్ (కూలింగ్)తో రక్షిత మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. బస్టాండ్ ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతామని డీపీటీవో షేక్ షబ్నం, డీఎం బి.వాణి తెలిపారు.

నరసాపురం

నరసాపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో ఆర్టీసీ నరసాపురం డిపో ఉత్తమ బస్టాండ్‌గా ఎంపికైంది. ప్రయాణికులకు తాగు నీరు, బస్టాండ్‌లో సదుపాయాలు, మరుగుదొడ్లు, ప్రయాణికులు కూర్చునే కుర్చీల నిర్వహణ, తడి, పొడి చెత్త వేరు చేయడం, బస్సుల్లో శుభ్రత తదితర అంశాలతో జిల్లా స్థాయి ఉత్తమ బస్టాండ్ అవార్డు వరించింది. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ పరిశుభ్రంగా ఉంచడంలో డీఎం ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. ప్రయాణికులకు అవగాహన కల్పించారు.



నరసాపురం బస్టాండ్ ఆవరణ

విష్ణు కళాశాల విద్యార్థినులకు గూగుల్ ఉద్యోగాలు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

భీమవరం రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ రంగం స్లోగా ఉంది. ఉద్యోగ అవకాశాలు నాలుగేళ్లుగా అంతంతగానే ఉన్నాయి.. అంటూ నిరాశ పడుతున్న వేళ.. భీమవరంలోని విష్ణు మహిళా ఇంజనీరింగ్ విద్యార్థినులు గూగుల్‌లో ఉద్యోగాలు సాధించారు. ఏకంగా ఏడాదికి రూ. 59.1 లక్షల జీతం పొందనున్నారు. ప్రతిభ, పట్టుదల ఉంటే ఎలాంటి సమయంలోనైనా ఉద్యోగాన్ని అందిపుచ్చుకోగలమని వీరు నిరూపించారు. వీరిలో ఒక విద్యార్థిని డి.రేణుక గంగా తండ్రి విజయవాడలో ఆర్టీసీ కండక్టర్‌గా పని చేస్తున్నారు. ఉద్యోగ రీత్యా విజయవాడలో ఉంటుంటారు. అసలు ఊరు ముదినేపల్లి మండలం వడలి గ్రామం. మరొక విద్యార్థినికి డి.సాత్విక. తండ్రి ఫైనాన్షియల్ ఉద్యోగం చేస్తున్నారు. ఉద్యోగ రీత్యా విశాఖపట్నంలో ఉంటున్నారు. అసలు ఊరు గుంటూరు జిల్లా చిలకలూరి పేట. కళాశాల నుంచి గూగుల్ కంపెనీకి ఎంపిక కావడంపై రేణుక గంగా, సాత్వికలను విష్ణు ఎడ్యుకేషన్ చైర్మన్ కేవీ విష్ణురాజు, వైస్ చైర్మన్ రవి చంద్రన్ రాజగోపాల్, సెక్రటరీ ఆదిత్య విక్రం, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ వెంకట్రామరాజు అభినందించారు.

ఐఐటీకి వెళదామనుకుని..



ఐఐటీకి వెళదామనుకుని ఇంజనీరింగ్‌లో చేరాను. ప్రథమ సంవత్సరం నుంచి గూగుల్ కంపెనీలో ఉద్యోగం సాధించాలని లక్ష్యం పెట్టుకున్నాను. ఆలోచనలతో చేశారు. కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకున్నాను. నాకు తెలిసిన సీనియర్స్ నుంచి కొన్ని వాటిపై అవగాహన పెంచుకున్నాను. మంచి ఉద్యోగాలు సాధించిన వేరే కళాశాల వాళ్ళ గురించి తెలుసుకున్నాను. ప్రతిభ కలిగిన వారి వాట్సప్ గ్రూపులో చేరాను. దాని వల్ల కొంత మోటివేషన్ పెరిగింది. కళాశాల నుంచి మంచి ట్రైనింగ్ అందింది. ఎక్కువ సమయం చదువుకు కేటాయించాను. హార్డ్ వర్క్ చేశాను.

- డి.సాత్విక, విష్ణు మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని


కౌశల్ సైన్స్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఈవో, తదితరులు

కౌశల్ సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీలైన కౌశల్-2025 సైన్స్ పోటీల షెడ్యూలును ప్రభుత్వం విడుదలచేసింది. ఈ మేరకు పోటీల వాల్‌పోస్టర్లను సోమవారం డీఈవో వెంకటలక్ష్మమ్మ, అసిస్టెంట్ డైరెక్టర్ అవధాని, రాష్ట్ర కోఆర్డినేటర్ స్వర్ణ వెంకటేశ్వరరావు, జిల్లా కోఆర్డినేటర్ జె.విజయరత్నబాబు ఏలూరులో విడుదల చేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఇందులో పాల్గొనవచ్చన్నారు. క్విజ్‌పోటీలు 8, 9, 10 తరగతుల విద్యార్థులకు, రీల్ పోటీ 10వ తరగతి విద్యార్థులకు, పోస్టర్ కాంపిటీషన్ 8, 9 తరగతుల విద్యార్థులకు జరుగుతాయన్నారు. అక్టోబరు వరకు నిర్దేశించిన ఎస్సీఈఆర్టీ సిలబస్ అనుసరించి పోటీలు ఉంటాయన్నారు. పాఠశాల స్థాయిలో ప్రతీ పోటీ నుంచి 20మంది చొప్పున విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపికచేస్తారని వివరించారు. జిల్లాస్థాయిలో ఆన్‌లైన్ విధానంలో పోటీలు జరుగుతాయని, ప్రతీ విభాగంలో ఇద్దరుచొప్పున విజేతలను ఎంపికచేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. పాఠశాల స్థాయి పోటీలు నవంబరు 1, 3, 4 తేదీలు, జిల్లాస్థాయి పోటీలు నవంబరు 27, 28 తేదీలు, రాష్ట్రస్థాయి పోటీలు డిసెంబరు 27న తిరుపతి భారతీయ విజ్ఞాన సమ్మేళనం భవనంలో జరుగుతాయని వివరించారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో పీఈటీ పద్మావతి

లింగపాలెం, అక్టోబరు 6, (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఎస్జీఎఫ్ సెలక్షన్స్ ఏలూరు ఇండోర్ స్టేడియంలో హ్యాండ్ బాల్ సెలక్షన్స్ అండర్-14 క్రీడా విభాగంలో లింగపాలెం మండల కలరాయగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. కలరాయగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్లో తొమ్మిదవ తరగతి చదువుతున్న మాణికల అఖిల్‌కుమార్, చెరుకు విక్రమ్, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక అయ్యారు. ఎంపికైన విద్యార్థులను పీఈటీ ఎం.పద్మావతి, హెచ్‌ఎం కె శ్రీనివాసరావు, ఎంఈవోలు కె రామారావు, జె రవీంద్ర, గ్రామ సర్పంచ్ సీహెచ్.రవిబాబు అభినందించారు.


సిద్ధాంతం వశిష్ఠ గోదావరికి పంచ హారతులు ఇస్తున్న పండితులు

గోదావరికి హారతి

పెనుగొండ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సిద్ధాంతంలో సోమవారం రాత్రి గోదావరి పుష్కర రేవు వద్ద ఆశ్వయుజ పూర్ణిమ సందర్భంగా గోదావరి హారతి, వాల్మీకి మహర్షి జయంతి అత్యంత వైభవంగా నిర్వహించారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి, వేద పండితులు కలగ భద్రుడు స్వామి ఆధ్వర్యంలో నిట్టాల సతీష్, లక్ష్మీదేవి దంపతులు వశిష్ఠ గోదావరికి పంచ హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ రేణుక, తదితరులు పాల్గొన్నారు.



నిబంధనలకు తూట్లు..
ప్రజారోగ్యంతో ఆటలు !

- అడ్డుగోలుగా చికెన్ వ్యర్థాల తరలింపు
- చేపల చెరువుల మేతగా వినియోగం
- చోద్యం చూస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఓ చేపల చెరువులో వేసిన చికెన్ వ్యర్థాలు

చేపల పెంపకంలో మేతగా చికెన్ వ్యర్థాల వినియోగం పెచ్చుమీరుతోంది. అది ప్రజారోగ్యానికి చేటుగా పరిణమిస్తోంది. జంట నగరాలైన హైదరాబాద్, సికింద్రాబాద్‌ల నుంచి చికెన్ వ్యర్థాలు రోజుకు 50కు పైబడి లారీల్లో జిల్లాలోని చేపల చెరువులకు డంప్ అవుతోంది. మత్స్యశాఖ, పోలీస్, రెవెన్యూ శాఖలు పట్టనట్టు వ్యవహరించడంతో వ్యర్థాలు తరలించే మాఫియా ఆటలు యథేచ్ఛగా సాగుతున్నాయనే ఆరోపణలున్నాయి.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ఏలూరు జిల్లాలో కొల్లేరుతో పాటు పరివాహక ప్రాంతాల్లోని చేపల చెరువులకు దాణా, పిల్లెట్ రూపంలో భారీగా మేత ఖర్చులవుతున్నాయి. దీనిని తప్పించుకోవడానికి యజమానులు అడ్డదారులు తొక్కుతూ నిబంధనలకు తూట్లు పొడుస్తూ చికెన్ వ్యర్థాలతో ప్రజారోగ్యానికి చేటు తెస్తున్నారు. ఒకప్పుడు విచ్చలవిడిగా జిల్లాలో ఆఫ్రికన్ క్యాట్‌ఫిష్ పెంపకం గుట్టుచప్పుడు కాకుండా సాగిపోతుండేది. అప్పుడు ఈ చికెన్ వ్యర్థాల మాఫియా ఆగడాలకు అంతేలేకుండా పోయేది. నిబంధనలను మామూళ్లతో ఏమార్చి.. సరుకును సరఫరా చేసి రూ.కోట్ల టర్నోవర్ సాగించేవారు. క్యాట్‌ఫిష్‌కు కోల్‌కత్తా, బెంగాల్ మార్కెట్లలో అప్పట్లో డిమాండ్ ఉండేది. అప్పుడు క్యాట్‌ఫిష్ చెరువులను జిల్లా యంత్రాంగం ఖాళీ చేయించడంతో.. ఇప్పుడు మేతతో పెరిగే చేపలకు చికెన్ వ్యర్థాల మోత పెచ్చుమీరుతోందన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కిలో రూ.3 నుంచి రూ.5కు సేకరించి, దాన్ని ఏలూరు జిల్లాలో చేపల చెరువులకు కిలోకి రూ. 12 నుంచి రూ.13 వరకు అమ్ముతున్నారు. వ్యర్థాలను బొలెరో వాహనంలో తరలిస్తే రూ.20 వేలు, ఐషర్ వాహనంలో రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు సరఫరా చేసే మాఫియాకు మిగులుతున్నట్టు తెలుస్తోంది.

వివిధ రూట్లులో సాగుతోందిలా ..

హనుమాన్ జంక్షన్- అప్పనవీడు, పెరికీడు-వసంతవాడ, వెంకటాపురం-అందేఖాన్ చెరువు, వడ్డిగూడెం-గుడిపాడు, మాదేపల్లి-శ్రీపర్రు, నూజివీడు- మీర్జాపురం, ఏలూరు రైల్వేస్టేషన్ సమీపంలోని కొమడవోలు నుంచి చాటపర్రు మీదుగా వయా గుడివాకలంక, దెందులూరు చెక్‌పోస్టు మీదుగా పూళ్ల, ఆగడాలలంక, చెట్టున్నపాడులకు యథేచ్ఛగా చికెన్ వ్యర్థాల లోడులు వ్యాన్‌ల్లో(9 టన్నులు), లారీల్లో (14 టన్నులు) చొప్పున తరలిపోతుంటాయి. అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకోకపోతే ఒక్క పెదపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోనే అడపాదడపా కేసులు నమోదవుతుంటాయి. ఈ విషయంలో రోజూ లక్షల్లో చేతులు మారుతున్నట్లు ఆరోపణలున్నాయి. చేపల చెరువుల్లో మేతగా దాణా, పిల్లెట్ల రూపంలో ఖర్చు తగ్గించుకోవడానికి చేసుకునే దందాలో ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉంది. దెందులూరు పోలీస్ స్టేషన్ పరిధిలోనే, ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్లలో కేసుల నమోదు చేయకపోవడం, లోడ్ వ్యాన్‌లు, లారీలు పట్టివేత లేకపోవడం వెనుక మాఫియా అండదండలు ఏ మేరకు అందుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఈ మాఫియాకు అడ్డుకట్ట వేసే విషయంలో జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులకు పట్టించుకోకపోవడం శోచనీయం.

రెండు నియోజకవర్గాలే అడ్డాగా..

చికెన్ వ్యర్థాల మాఫియాలో కొందరు ప్రజాప్రతినిధుల అనుచరులు, ఇతర ముఖ్యనేతలు ఇందులో భాగస్వామ్యం వహిస్తున్నారు. పెదపాడు, దెందులూరు, భీమడోలు, ఏలూరు రూరల్ మండలాల్లోని కొందరి నేతల గణం.. ఈ మాఫియాకు అండగా ఉన్నారన్న ఆరోపణలున్నాయి. రోజుకు 50కు పైనే చికెన్ వ్యర్థాల లోడు లారీలు ప్రధానంగా దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాలే అడ్డాగా రవాణా సాగుతుంటే నిఘా ఉంచాల్సిన పోలీస్ యంత్రాంగమే చతికిలపడుతోంది. కృష్ణాజిల్లా హైవేపై నుంచి హనుమాన్ జంక్షన్ మీదుగా అప్పనవీడు నుంచి వివిధ రూట్లలో అక్రమంగా చికెన్ వ్యర్థాలు తరలుతుంటాయి. ఇదిలా ఉండగా చికెన్ వ్యర్థాలు తరలించే వాహనాలకు డ్రైవర్లను సరఫరా చేసే ప్రాంతం మాత్రం భీమడోలు మండలం తోకలపల్లిగా చెబుతుండటం విశేషం.


పెదపాడులో పట్టుకున్న చికెన్ వ్యర్థాలు తరలించే వ్యాన్లు(ఫైల్)

మోదేలు గ్రామస్థులకు సౌకర్యాలు కల్పించండి
అధికారులకు ఎస్టీ కమిషన్ సభ్యుడు నాయక్ సూచన

బుట్టాయగూడెం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): తాతల కాలం నుంచి అడవినే నమ్ముకుని జీవిస్తున్న తమను గ్రామాన్ని ఖాళీ చేయమంటే ఎట్టి పరిస్థితుల్లోను అంగీకరించబోమని మోదేలు కొండరెడ్లు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్‌కు తేల్చి చెప్పారు. వారి ఆవేదనను విన్న నాయక్ వారు కోరినట్లే ఇక్కడే వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఏలూరు జిల్లా కేఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని బుట్టాయగూడెం-వేలేరుపాడు సరిహద్దు మండలాల్లోని మోదేలు కొండరెడ్డి గ్రామాన్ని జాతీయ ఎస్టీ కమిషన్ మెంబరు హుస్సేన్ నాయక్ సోమవారం సందర్శించి వారి సమస్యలడిగి తెలుసుకున్నారు. కొండరెడ్లు కోరినట్లు గ్రామంలోనే మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. లంకపాకల గ్రామాన్ని సందర్శించిన కమిషన్ మెంబరుకు గ్రామస్థులు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు ఇవ్వాలని, ఆర్ అండ్ ఆర్ సమస్యలు పరిష్కరించాలని, ఆయుధ డిపోను వేరే ప్రాంతంలో నిర్మించాలని కోరారు. మాజీ మంత్రి జలగం ప్రసాదరావు, ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్, ఆర్డీవో ముక్కంటి, డీఎఫ్‌వో సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి..

కొయ్యలగూడెం: చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ అన్నారు. ఏ వర్గాల ప్రజలైనా తమ సమస్యలను కమీషన్ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సోమవారం కొయ్యలగూడెంలో విలేకరుల సమావేశంలో


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా భారతదేశం నిలుస్తుందని అందుకు ప్రధాని నరేంద్రమోడీ తీసుకుంటున్న నిర్ణయాలే కారణమన్నారు. ప్రజలకు సేవ చేయడంలో అధికారులు చిత్తశుద్ధి చూపటంలేదని విమర్శించారు. పశ్చిమ ఏజెన్సీ సమస్యలు తెలుసుకోవడానికి వచ్చానని ఈ సందర్భంగా తెలిపారు. సమావేశంలో ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొల్లిన నిర్మలాకిషోర్, మహిళా మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుభద్రాదేవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు పారేపల్లి రామారావు, సోముబాబు, టీడీపీ నాయకురాలు గంగిరెడ్ల మేఘలాదేవి, జనసేన మండల అధ్యక్షుడు తోట రవి, బీజేపీ మండల అధ్యక్షుడు గొలిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

8న బీఎస్సీ హార్టికల్చర్‌లో ప్రవేశానికి కౌన్సెలింగ్ : రిజిస్ట్రార్

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ పరిధిలో కళాశాలల్లో బీఎస్సీ (ఆనర్స్) హార్టికల్చర్ ప్రవేశానికి ఈ నెల 8న మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు రిజిస్ట్రార్ డాక్టర్ బి శ్రీనివాసులు సోమవారం తెలిపారు. హార్టిసెట్ ర్యాంకుల ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు వివరించారు. విద్యార్థులు స్వయంగా తగిన ధ్రువపత్రాలు, ఫీజుతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని రిజిస్ట్రార్ తెలిపారు.

ఎస్జీఎఫ్ క్రీడా ఎంపికలకు 376 మంది హాజరు

ఏలూరు అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికలకు తైక్వాండో, హ్యాండ్‌బాల్ ఎంపికలు సోమవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో జరిగాయి. వివిధ పాఠశాలల నుంచి మొత్తం 376 మంది క్రీడాకారులు, 27 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వ్యాయామ విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులు కె.అలివేలు మంగ, కె.దుర్గాప్రసాద్ తెలిపారు. విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అవధాని, పీఈటీల సంఘం కార్యదర్శి ఐ.రమేష్ పాల్గొన్నారు.

బస్సు నుంచి జారిపడి చెయ్యి నుజ్జునుజ్జు


గాయపడిన గిరిజన మహిళ

బుట్టాయగూడెం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు నుంచి జారిపడి ఓ మహిళ తన చెయ్యిని కోల్పోయింది. మండలంలోని లక్ష్మీపురం వద్ద సోమవారం ఈ ఘటన జరిగింది. మండలంలోని పాత రాజానగరం గ్రామానికి చెందిన వెట్టి జయమ్మ కన్నాపురం నుంచి పోలవరం వెళ్తున్న జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును రాజానగరంలో ఎక్కింది. ప్రయాణికులతో బస్సు ఫుల్‌గా ఉండటంతో డోర్ వద్దే ఉన్న జయమ్మ లక్ష్మీపురం బ్రిడ్జి వద్ద ప్రమాద వశాత్తు కింద పడిపోయింది. అదే సమయంలో బస్సు వెనుక టైర్లు చెయ్యి మీదుగా వెళ్లడంతో పూర్తిగా నలిగిపోయింది. తోటి ప్రయాణికుల ద్వారా విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని జయమ్మను హుటాహుటిన రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో బస్సు లో పరిమితికి మించి జనాలను ఎక్కించడం వల్లే ఇలా జరిగిందని, ఇరుకైన సింగిల్ రోడ్డులో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడం వల్లే జయమ్మ గాయపడినట్టు ప్రయాణికులు పేర్కొన్నారు. జయమ్మ గాయపడిన విషయాన్ని కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు.

రైలు ఢీకొని మతి స్థిమితం లేని వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలుదాటుతున్న ఒక వ్యక్తిని ప్రమాద వశాత్తు రైలు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు ఆదివారపుపేటకు చెందిన మునిశెట్టి బంగారు బాబు(40) రజక వృత్తిని చేస్తూ జీవిస్తున్నాడు. అతని భార్య అనారోగ్యంగా ఉండడంతో బంగారుబాబు మానసికంగా ఎంతో వేదన పడుతూ మతిస్థిమితం కోల్పోయాడు. సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి గన్‌బజార్ వద్ద రోడ్డు కం రైల్వే బ్రిడ్జి వద్ద రైలు పట్టాలుదాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు రైల్వే పోలీసులకు అందడంతో రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కల్పించిన 40 మందిపై కేసు

పెనుగొండ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన 40 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. దేవి నవరాత్రుల సందర్భంగా మండలం సిద్ధాంతం దుర్గమ్మ గుడి బస్టాండ్ సెంటర్ రోడ్డులో ఎటువంటి అనుమతి లేకుండా బొలేరో ట్రక్‌పై డీజే సౌండ్ బాక్స్‌లతో ట్రాపిక్‌కు అంతరాయం కలిగించిన వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వీరు నక్కావారిపాలెంకు చెందిన వ్యక్తులు రోడ్డుపై కూర్చుని సుమారు 30 నిమిషాలకు పైగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించి ప్రజలకు ఇబ్బంది కలిగించినట్లు తెలిపారు. ఎటువంటి అనుమతి లేకుండా ఊరేగింపులో డీజే సౌండ్స్ ఉపయోగించి ప్రజలకు ఇబ్బందులు కలిగించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

లింగపాలెం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లై, రెవెన్యూ సిబ్బందితో కలిసి పట్టుకున్నట్టు డీటీ ప్రసాద్ తెలిపారు సివిల్ సప్లై డీటీ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం లింగపాలెం మండలంలోని ధర్మాజీగూడెం కొణిజర్ల రోడ్డులో ఒక వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న రూ.36వేల విలువైన 10 క్వింటాల 39కేజీల రేషన్ బియ్యాన్ని సోమవారం రెవెన్యూ, సివిల్‌సప్లై అధికారులు పట్టుకు న్నారు. వ్యాన్‌లో 21మూటల్లో నింపి తరలిస్తుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. బియ్యం కొనుగోలు చేసిన వ్యక్తి, వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైలు పట్టాలపై యువకుడి ఆత్మహత్యాయత్నం
- కాపాడిన పోలీసులు


యువకుడితో పోలీసులు

ఏలూరు క్రైం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సమస్యలు ఉన్నాయని క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకోవడం వల్ల సమస్యలు పరిష్కారం కావని ఏలూరు త్రీ టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు సూచించారు. ఏలూరు బీడీ కాలనీ ప్రాంతానికి చెందిన షేక్ ఉమర్ షారూక్ ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అయితే భార్యా భర్తల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో జీవితంపై విరక్తిచెంది ఏలూరు త్రిటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం ఆత్మహత్య చేసుకోవాలని రైలు పట్టాలపై ఉన్నాడు. అదే సమయంలో ఆ సంఘటన చూసిన వారు 112కు కాల్ చేసి పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో ఏలూరు త్రీ టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ రాంబాబు, కానిస్టేబుల్ నరేంద్ర వెంటనే వెళ్లారు. అప్పటికే రైలు వద్దకు వచ్చేస్తున్న సమయంలో ప్రాణాలను లెక్క చేయకుండా కానిస్టేబుల్ నరేంద్ర రైలు పట్టాలపైకి వెళ్లి షారూక్‌ను కాపాడారు. అనంతరం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లి దండ్రులకు సమాచారం ఇచ్చారు. ఆత్మహత్య వల్ల ఆ కుటుంబం తీరని దుఃఖసంద్రంలో ఉంటుందని,స్నేహితులు కూడా వేదనకు గురవుతారని, ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదని ఏ సమస్య అయినా ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు.


నక్కల కాలువ ముంపు కారణంగా వరద చేరి కుళ్లిపోయిన వరి పొలాలు

పంటలు కోల్పోవడం ఇక మా వల్ల కాదు..
- నక్కల కాలువ పరివాహక రైతుల ఆవేదన
- శాశ్వత పరిష్కారం కావాలని డిమాండ్

ఆచంట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఆచంట వేమవరం నక్కల కాలువను ఆనుకుని ఉన్న సార్వా పంటకు సంబంధించి పొలాలు నిత్యం ముంపు బారిన పడుతుంటాయి. సుమారు నక్కల కాలువను ఆనుకుని 600ఎకరాలు పంట పొలాలు సార్వా పంట సమయంలో తరచూ వర్షాలు కురవడం, దానికి తోడు గోదావరి ఉధృతి ఎక్కువగా ఉండటంతో ఈ ప్రాంతంలో ఉన్న పొలాలు ముంపు బారిన పడ్డాయి. వేసిన నాట్లు పాడవడంతో రైతులు మరోసారి నాట్లు వేశారు. గోదావరి మరలా ఉగ్రరూపం దాల్చడం, నక్కల కాలువ పెరగడంతో మళ్లీ అదే సమస్య తలెత్తింది. సుమారు 600 ఎకరాల్లో రెండు సార్లు వేసిన నారు కుళ్లిపోయింది. నక్కలకాలువ వల్ల రైతులకు సార్వా పంటకు సంబంధించి నష్టం జరగకుండా ఉండాలంటే నక్కల కాలువ నుంచి శాశ్వత పరిష్కారం చేపట్టాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు. లేకపోతే ప్రతి ఏటా ఇదే పరిస్థితి తలెత్తుతుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

పదేళ్ల తరువాత తెరుచుకున్న పెనుమంట్ర సొసైటీ లాకర్లు


లాకర్లు ఓపెన్ చేస్తున్న అధికారులు

పెనుమంట్ర, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి):పదేళ్ల తర్వాత పెనుమంట్ర విశాల సహకార పరపతి సంఘం సేఫ్ లాకర్లు సోమవారం మధ్యాహ్నం మండల స్థాయి కమిటీ త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో సెంట్రల్ బ్యాంక్ సిబ్బంది సేఫ్ లాకర్లు తెరిచారు. 2015లో అప్పటి పాలకవర్గం సీఈవో కలిసి బినామీలకు రుణాలు మంజూరు చేశారని అవినీతి ఆరోపణలతో విమర్శలు ఎదుర్కొంది. అప్పటి మండల పరిషత్ అధ్యక్షురాలు కలిగిపూడి సరోజినీ,మాజీ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లడంతో అప్పటి సీఎం చంద్రబాబును కలిసి సొసైటీ అవినీతిని వివరించగా సీబీసీఐడీ విచారణకు ఆ దేశించారు.బ్యాంకుపై రైతులకు నమ్మకం సన్నగిల్లడంతో కార్యకలాపాలు తగ్గుముఖం పట్టాయి. ఇటీవల త్రిసభ్య కమిటీ ఏర్పాటుతో జిల్లా సహకార బ్యాంక్ త్వరలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయనున్న గోల్డ్ లోన్ ప్రాజెక్టులో భాగంగా రైతాంగానికి రుణాలు మంజూరు చేసేందుకు సోమవారం సాయంత్రం ఎంఎల్‌వో ఎం.ఎం.రెహమాన్, సూపర్ వైజర్ పసుపులేటి రాంబాబు సెక్రటరీ కె. వెంకటేష్ డిప్యూటీ తహసీల్దార్ ఏలియమ్మ, పోలీస్ సిబ్బంది సమక్షంలో సేఫ్ లాకర్లు తెరిచారు. ఎటువంటి వస్తువులు లేవని, రైతాంగం వినియోగించుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. పదేళ్లుగా సీఈవో వద్దే సేఫ్టీ లాకర్ తాళాలు ఉండటంతో ఓపెన్ చేయలేకపోయారు. సొసైటీ కార్యదర్శికి సేఫ్ లాకర్ల తాళాలు అందజేయడంతో అధికారుల సమక్షంలో తెరిచామని సహకార సంఘం అధికారులు తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

భీమవరం క్రైం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వేర్వేరు చోట్ల ఇద్దరు మృతి చెందారు. మొక్కలు శుభ్రం చేస్తుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తగిలి ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, ఆక్వా చెరువు వద్ద మరొకరు మృతి చెందారు.వన్‌టౌన్ ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం స్థానిక చిన అప్పారావు తోటకు చెందిన లాజర్(50) వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం రాత్రి మొక్కలు శుభ్రం చేస్తున్నాడు. ఆ సమయంలో అరటి చెట్టు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో లాజర్‌కు షాక్ తగిలింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ఆసుపత్రికి తరలించారు.

చేపల చెరువు వద్ద..

మొగల్తూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వ్యక్తి మృతి చెందినట్టు మొగల్తూరు ఎస్ఐ వై. నాగలక్ష్మి తెలిపారు.భీమవరం మండలం వెంప గ్రామానికి చెందిన తోటి మనోహర్(46) మొగల్తూరు పంచాయతీ పరిధి నక్కావారిపాలెంలో ఆక్వా చెరువులపై పని చేస్తున్నాడన్నారు. చెరువు వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఆదివారం ఫీజు తగిలిస్తుండగా షార్ట్ సర్క్యూట్‌తో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

నరసాపురంరూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): నరసాపురం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తుంద్రురులో కోడిపందేల స్థావరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. 11 మందిని అరెస్టు చేసి వారి నుంచి 23,250 నగదు, పది మోటార్ సైకిళ్లు, నాలుగు సెల్ ఫోన్లు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్.ఐ. వెంకట సురేశ్ తెలిపారు. పట్టుబడిన నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.


దుకాణాలు పరిశీలిస్తున్న పోలీసులు

బాణసంచా దుకాణాల్లో తనిఖీలు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాణసంచా దుకాణాలను జంగారెడ్డిగూడెం సీఐ ఎం.వి.సుభాష్, ఎస్.ఐ. ఎస్.కె. జబీర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. సీఐ సుభాష్ మాట్లాడుతూ దీపావళి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో లైసెన్సు లేకుండా అక్రమంగా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.పేలుడు సామగ్రి నిల్వ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎవరైనా అక్రమంగా బాణసంచా విక్రయిస్తే 112కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు.

వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తణుకు, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): చిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కాలేజీలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సి.హెచ్.ఏడుకొండలు తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో కనీసం 55శాతం మార్కులు సాధించి నెట్, సెట్, పీహెచ్డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 10వ తేదీ సాయంత్రం లోగా కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

భీమవరం డిపో ఇన్‌చార్జి డీఎంగా వేణు



భీమవరం టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : భీమవరం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా నెల్లూరులో ఆర్టీసీ జోనల్ కార్యాలయంలో స్టోర్స్ అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై డిపోకు ఇన్‌చార్జి డీఎంగా బదిలీ చెయ్యటంతో ఆయన సోమవారంనాడు బాధ్యతలు స్వీకరించారు. జూన్ 30న ఇక్కడ డీఎంగా పనిచేసిన పీవీవీఎం సత్యనారాయణమూర్తి పదవీ విరమణ చేశారు. ఇప్పటి వరకు నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ సుబ్బన్న రెడ్డి ఇన్‌చార్జిగా వ్యవహరించారు.



స్వచ్ఛ ప్రభుత్వ ఆస్పత్రుల విభాగంలో లంకలకోడేరు పీహెచ్‌సీ, తణుకు జిల్లా ఆస్పత్రి...గ్రీన్ అంబాసిడర్స్ విభాగంలో వేండ్రం గ్రామపంచాయతీ కోనాల ఆనందరావు, చింతపర్రు గ్రామపంచాయతీ సోమదుల దుర్గాప్రసాద్, పెద తాడేపల్లి కండెల్లి రాములు.. బెస్ట్ స్వచ్ఛతా ఎన్జీవోస్‌లో చెరుకువాడ రంగసాయి.. బెస్ట్ స్వచ్ఛతా వారియర్స్‌లో తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ మల్లిపూడి ముత్యాలు,తణుకు మునిసిపాలిటీకి చెందిన లక్ష్మి అవార్డులు అందుకున్నారు.

స్వచ్ఛ అవార్డులు ప్రదానం

భీమవరంలోని జిల్లా కలెక్టరేట్ పరేడ్ గ్రౌండ్‌లో జిల్లాస్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, కలెక్టర్ చదలవాడ నాగరాణి విచ్చేసి అవార్డులు అందించారు.



స్వచ్ఛ అంగన్‌వాడీల విభాగంలో లక్ష్మణేశ్వరానికి చెందిన దెందుకూరి విజయలక్ష్మి, పాలకోడేరు మండలం కె.జ్యోతిలక్ష్మి, రాయలానికి చెందిన సిహెచ్ మహాలక్ష్మి.. బెస్ట్ బస్టేషన్స్ విభాగంలో నరసాపురం డీఎం సుబ్బన్న రెడ్డి.. స్వచ్ఛ గ్రామ పంచాయతీల విభాగంలో చిన అమిరం, తేతలి, వాండ్రం పంచాయతీలు అవార్డులు అందుకున్నాయి.



స్వచ్ఛ పరిశ్రమలు విభాగంలో తుందుర్రు గ్రామం గోదావరి మెగా ఆక్వా ఫుడ్ పార్క్.. స్వచ్ఛ స్కూల్స్‌లో అత్తిలి గర్ల్స్ హై స్కూల్, వీరవాసరం జడ్పీహెచ్ స్కూల్, పాలకోడేరు జడ్పీహెచ్ స్కూల్.. స్వచ్ఛ రైతుబజార్స్‌లో అత్తిలి రైతు బజార్.. స్వచ్ఛ విలేజ్ ఆర్గనైజేషన్స్‌లో పాలకోడేరు మండలం గొల్లలకోడేరు, భీమవరం మండలం గొల్లవాని తిప్ప, అత్తిలి మండలం కొమ్మర.. స్వచ్ఛ వసతి గృహాలు విభాగంలో నర్సాపురం ఎస్.డబ్ల్యూ కాలేజ్ బాయ్స్ హాస్టల్ అవార్డులు దక్కించుకున్నాయి.

అమ్మవారి ఊరేగింపులు



ఆకివీడు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రోత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారం నిర్వహకులు భారీ ఊరేగింపులు నిర్వహించారు. మాదివాడలోని గంగానమ్మ-మద్దిరావమ్మ దేవాలయం దగ్గర అమ్మకు ఊరేగింపుగా భారీ సూర్యభగవాన్ రథం ఏర్పాటు చేశారు. గరగ నృత్యం, బేతాళ బృందం, కాళికా, కోయ నృత్యాలు, తెలంగాణా బోనాల డ్యాన్స్ శక్తి వేషాలు తదితర వాటితో గంగానమ్మ యూత్ ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ నెల 24న అఖండ అన్నసమారాధన నిర్వహిస్తున్నామన్నారు. అదే విధంగా సాలిపేటలోని పుంతల ముసలమ్మ 30వ వార్షికోత్సవంలో భాగంగా పలు వేషధారణలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ నెల 12న అఖండ అన్నసమారాధన నిర్వహిస్తున్నారు.

యలమంచిలి: యలమంచిలి, అడవిపాలెం గ్రామాల్లో మండపాల వద్ద ప్రతిష్ఠించిన కనకదుర్గమ్మవారి విగ్రహాల నిమజ్జనోత్సవాలను నిర్వాహకులు సోమవారం వైభవంగా నిర్వహించారు. డీజేలు, యువత నృత్యాలు, తీన్‌మార్ డప్పులు, బాణసంచా కాల్పులతో కనకదుర్గమ్మవారి విగ్రహాలను ఊరేగింపు నిర్వహించిన అనంతరం వశిష్ఠ గోదావరిలో నిమజ్జనం చేశారు. పలు ఆలయాలు, మండపాల వద్ద నిర్వాహకులు అన్నసమారాధనలు చేపట్టారు.

సోమేశ్వరస్వామి ధర్మకర్తల ప్రమాణ స్వీకారం

భీమవరం టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పరమేశ్వరుని పాదాల చెంత సేవా చేయడమంటే ఎంతో మహాభాగ్యమేనని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. పంచారామ క్షేత్రమైన భీమవరం సోమేశ్వర జనార్దన స్వామి దేవస్థానం నూతన పాలకవర్గ సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. దేవస్థాన చైర్మన్‌గా చింతలపాటి బంగార్రాజు, సభ్యులుగా బ్రహ్మజ్యోసుల సత్య ప్రసాద్, బొచ్చ కృష్ణవేణి, పి.లీలా కుమారి, కృష్ణపాల వెంకట రామ, నాగేంద్ర విజయ లక్ష్మీకు మారి సాయి, యార్లగడ్డ రమేష్, బండి రమణ, పోతునూరి శ్యామ్, పెద్దింటి జ్యోతిమయి, కొప్పర్తి విజయ కుమార్ లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ కలిదిండి సుజాత, డాక్టర్ ఇర్రింకి సూర్యారావు, ఇందుకూరి రామలింగరాజు, కోళ్ళనాగేశ్వరరావు, గని రెడ్డి త్రినాథ్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు(చినబాబు) పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్లు నిర్మించాలని సీపీఐ వినతి

భీమవరం టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): యనమదుర్రు డ్రెయిన్‌పై భీమవరం పట్టణం, గొల్లవానితిప్ప, నాగేంద్రపురం గ్రామాల్లో కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి వంతెనలు నిర్మించిన పాలకులు అప్రోచ్ రోడ్లను వేయకపోవడం దారుణమని యుద్ధ ప్రాతిపదికన అప్రోచ్ రోడ్లు నిర్మించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ నాయకులు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మకు వినతి పత్రం అందజేశారు.

పంటల కోత ప్రయోగాలపై శిక్షణ

తణుకు రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):పంట కోత ప్రయోగాలకు సంబంధించి సిబ్బంది అవగాహనతో మెలగాలని డివిజనల్ గణాంకాధికారి ఎం.సత్యనారాయణ అన్నారు. సోమవారం తేతలి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో వరి పంట కోత అంచనాల ప్రయోగాలపై సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. తణుకు మండలంలో పంటల బీమా పథకానికి సంబంధించి 9 బీమా యూనిట్లు వున్నాయన్నారు. వీటిలో మొత్తం 36 పంటల కోత ప్రయోగాలు చేయాలని చెప్పారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కే రాజేంద్ర ప్రసాద్, ఏఎస్‌వో ఎ.గోవర్దనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐతో నూతన ఆవిష్కరణలకు అవకాశం

తణుకు, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అందుబాటులోకి రావడంతో సాంకేతికంగా ఎన్నో నూతన ఆవిష్కరణలకు అవకాశం ఏర్పడిందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం విజయవాడలోని ఏపీ సైన్సు అండ్ టెక్నాలజీ అకాడమి చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన మందలపు రవిని ఎమ్మెల్యే ఆరిమిల్లి అభినందించారు.

అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పది

భీమవరం టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అన్నిధనాల కెల్లా అన్నదానం గొప్పదని, దైవ కార్యక్రమంలో అన్నదానం చేయడం భగవంతుడు మెచ్చే కార్యక్రమమని మాజీ ఎ మ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మెంటే వారి తోటలోని శ్రీబాలత్రిపుర సుందరి దేవి అమ్మవారి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి వేడుకలు ముగింపులో నిర్వహించిన అన్న సమా రాధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

హోంగార్డును అడ్డుకున్న ముగ్గురిపై కేసు

యలమంచిలి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): హోంగార్డు నాగేశ్వరరావు విధులను ఆటంకపరిచిన బాడవ గ్రామానికి చెందిన ఇంటి మోహనరావు, వెంకటేశ్వరరావు, రామకృష్ణలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.గుర్రయ్య తెలిపారు. ఈముగ్గురు గొడవ పడుతుండగా సమాచారం అందుకున్న హోంగార్డు నాగేశ్వరరావు సంఘటనా స్థలానికి వెళ్లగా ఆ ముగ్గురు వ్యక్తులు హోంగార్డుపై దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకపరిచారని ఎస్ఐ తెలిపారు.

బాలికను మోసగించిన బాలుడిపై కేసు

యలమంచిలి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): యలమంచిలి మండలంలోని ఒక గ్రామానికి చెందిన మైనర్ బాలికను ప్రేమిస్తున్నానని నమ్మించి మోసగించిన పాలకొల్లు మండలానికి చెందిన ఒక మైనర్ బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.గుర్రయ్య తెలిపారు.

ఉద్యోగులు సమయ పాలన పాటించాలి



పేరుపాలెం సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న పొత్తూరి

మొగల్తూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి):గ్రామ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు సూచించారు. పేరుపాలెంలోని గ్రామస్థుల ఫిర్యా దు మేరకు సోమవారం రామరాజు పేరుపాలెంలోని గ్రామ సచివా లయం సందర్శించారు. ఉదయం 11 గంటలు సమయం గడిచినా ఉద్యోగులు రాకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థాని కులు వివిధ పనుల నిమిత్తం వస్తుంటారని ఉద్యోగులు సమయపాలన పాటించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారనే ఫిర్యాదుతో ఆయన సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవలందించే ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహ రించడం తగదని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, సర్పంచ్ తిరుమాని విజయలక్ష్మీ, స్థానిక నాయ కులు మేళం బన్ను, సత్తినేని బాబ్జి, సర్వేశ్వరరావు, పాలా రాంబాబు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు కమీషన్ పెంచాలి

పాలకోడేరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లకు కమీషన్ మూడు రూపాయలు పెంచాలని తహసీల్దార్ భారతి విజయలక్ష్మికి సోమవారం రేషన్ డీలర్లు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పాలకోడేరు మండల రేషన్ డీలర్ల అసోసియేషన్ నాయకులు దొంగ కృష్ణ, సాయిరామకృష్ణ, విజయరత్నం, ఉష తదితరులు మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్ల నుంచి రేషన్ షాపులను డీలర్లకు అప్పగించిన త ర్వాత 65 సంవత్సరాలు నిండిన వృద్ధులకు, వికలాంగులకు ఇంటికి వెళ్ళి రేషన్ సరుకులు అందిస్తున్నామన్నారు. ఇంతవరకు తమకు ఎటువంటి రెమ్యూనరేషన్ ఇవ్వలేదన్నారు. 8 సంవత్సరాల క్రితం ఇస్తున్న కిలోకు రూపాయి కమీషన్ ఇప్పుడు కూడా అదే రూపాయి అందిస్తున్నారన్నారు. పెరిగిన ధరల దృష్ట్యా మూడు రూపాయల కమీషన్ ఇవ్వాలని కోరారు.

తూనికలు, కొలతల అధికారుల తనిఖీ



కిరాణాకొట్టులో యజమానితో మాట్లాడుతున్న శివమోహన్

ఆకివీడు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దుకాణాల వర్తకులు నిబంధనలు సక్రమంగా పాటించాలని భీమవరం తూనికలు కొలతల ఇన్‌స్పెక్టర్ శివమోహన్ అన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని పలు దుకాణాలు ఆయన పరిశీలించి కూరగాయలు, కిరాణా దుకాణలపై కేసులు నమోదుచేసి మాట్లాడారు. దుకాణాలకు సంబంధించి లైసెన్సులు, తూకం వేసే రాళ్ళకు సీళ్ల ఉండాలన్నారు. ఎంఆర్పీ కంటే అధికంగా అమ్మకాలు జరపరాదన్నారు.

'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందన

ఆకివీడు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి కథనంపై ఉన్నతాధికారులు విచారణకు దిగారు. ఆంధ్రజ్యోతిలో ఆగస్టు 17న సీఎం సహాయనిధి పక్కదారి పడుతుందని వచ్చిన కథనానికి కలెక్టర్ స్పందించి ఆర్డీవో విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కోరారు. అయితే విచారణలో జాప్యం చోటు చేసుకుంటుందని రజనీకాంత్ స్వచ్ఛంద సేవాసంస్థ కన్వీనర్ వర్ధినేని లక్ష్మీవర ప్రసాద్ ఇటీవల ఆకివీడులోని పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో భీమవరం ఆర్డీవో కార్యాలయం నుంచి విచారణకు రావాలని పిలుపు రావడంతో సోమవారం లక్ష్మీవర ప్రసాద్ వెళ్ళారు. ఆర్డీవో కార్యాలయంలోని పరిపాలనాధికారి లక్ష్మి ఫిర్యాదుదారుడు ప్రసాద్‌ను విచారించారు.

కరాటేలో పాలకొల్లు విద్యార్థుల ప్రతిభ



పాలకొల్లు టౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కరాటే బ్లాక్‌బెల్ట్ పరీక్షల్లో పాలకొల్లు జపాన్ షోటోఖాన్ కరాటే కవంజూకు ఆర్గనైజేషన్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఇన్‌స్ట్రక్టర్ ధనాని సూర్య ప్రకాష్ తెలిపారు. ఆదివారం ఏలూరులోని మున్సిపల్ పార్కులో జరిగిన ఈ పోటీల్లో తమ విద్యార్థులు ఎంజేఎస్ లాస్య (13 సంవత్సరాలు), వి.కార్తికేయ (14), టి.ప్రమోద్ (14) ప్రతిభతో బ్లాక్ బెల్ట్ సాధించినట్టు తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

భీమవరం టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొట్టాలని, పర్యావరణ పరిరక్షణకు మనందరం కృషి చేద్దామని పీఎస్ఎం మునిసిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బి.సాయి ప్రసాద్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పీఎస్ఎం హైస్కూల్లో సోమవారం ప్లాస్టిక్‌ను నిషేధించాలంటూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకంతో అనేక రోగాలు వస్తున్నాయని, అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజల్లో మార్పు చాలా అవసరమని అన్నారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను నిషేధించడం మనందరి నైతిక బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే షర్మిల, జీడిగుంట సునీల్, భైరెడ్డి శేష కుమారి, అల్లు అప్పారావు పాల్గొన్నారు.



త్రిసభ్య కమిటీని అభినందిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే అంజిబాబు, పాకా సత్యనారాయణ

తాడేరు సొసైటీ ప్రమాణ స్వీకారం

భీమవరం రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతు లేనిదే దేశం లేదని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. సోమవారం బేతపూడి కళ్యాణ మండపంలో తాడేరు సహకార సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారంలో వారు మాట్లాడారు. సహకార సంఘాల ద్వారా ఎరువులు, పురుగు మందులతో రైతులకు చేయూత అందిస్తుందన్నారు. రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందబాబు మాట్లాడుతూ సహకార సంఘాలు రైతులకు చేసే సేవలను చెప్పారు. ముందుగా త్రిసభ్య కమిటీ అధ్యక్షునిగా కొట్టు సురేష్, డైరెక్టర్లుగా జవ్వాది వెంకటేశ్వరరావు, కొత్తపల్లి ధైర్య తేజ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, సహకార సంఘ కార్యదర్శి నందమూరి సుబ్బారావు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీలు అందజేత

పెంటపాడు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఉత్తమ సమాజ నిర్మాణమే మానవతా సంస్థ లక్ష్యమని సంస్థ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పర్యావరణ కమిటీ చైర్మన్ తాడేపల్లి మోహన్‌రావు అన్నారు. సోమవారం పెంటపాడు కూనాకారపేటలోని పాఠశాలకు కుర్చీలు అందజేశారు.

నేడు అన్నసమారాధన

ఉండి, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి):ఈనెల 7వ తేదీన భవానీపేటలో అమ్మవారి ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. భవానీపేటలోని శ్రీదేవీ నవరాత్రుల 32వ వారికోత్సవాలు ముగిశాయి. ఉత్సవాలు ముగింపు సందర్భంగా మంగళవారం ఉదయం 11గంటల నుంచి అఖండ అన్నసమారాధన ఉంటుందని తెలిపారు.

విద్యార్థులతో అటవీశాఖ ర్యాలీ

ఆకివీడు రూరల్ అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే జంతుజాలం పట్ల మక్కువ చూపాలని అటవీశాఖ సిబ్బంది అన్నారు. చినకాపవరం జడ్పీపాఠశాలలో వన్యప్రాణి సంరక్షణా వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ కేవలం అడవులను కాపాడడం వల్లనే జరుగుతుందని అన్నారు. ప్లాస్టిక్ వలన వచ్చే అనర్థాలు వివరించారు. కొల్లేరు కైకలూరు రేంజర్ రామలింగాచార్యులు, ఎఫ్ఎస్‌వో రత్నరాజు, రాంబాబు, నరసింహరావు, రవికాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

సుప్రీం తీర్పుపై రివ్యూ పిటిషన్ వెయ్యాలని వినతి

భీమవరం టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీఈటీ) విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కేంద్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని, విద్యాహక్కు చట్టం-2009 అమలులోకి రాకముందు నియామకం పొందిన ఉపాధ్యాయులను టీఈటీ నుంచి మినహాయింపు ఇచ్చే విధంగా ఎన్‌సీటీఈ మార్గదర్శకాలలో సవరణ చేయవలసిందిగా పీఆర్‌టీయూ నాయకులు సోమవారం సాయంత్రం కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మను కలసి వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా నాయకులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పదోన్నతికై ఈవో, జీవో పరీక్షలు పాస్ అవుతున్నామని, మరల టీఈటీ కూడా పాస్ కావాలనే నిబంధనను పునఃసమీక్ష చేయవసినదిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని వివరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ఎల్ విచలం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి త్రినాథరావు, రాష్ట్ర కౌన్సిలర్ సునీల్ కుమార్, రాష్ట్ర ఆర్గనైసింగ్ కార్యదర్శి కుమార్,నాగేశ్వరావు, శివరామకృష్ణ, కృష్ణమూర్తి, కల్కి మూర్తి, అల్లు ప్రసాద్, కృష్ణ మూర్తి, నారాయణ రాజు, కోటేశ్వరరావు, రాధాకృష్ణ, రామాంజనేయులు,వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సర్పంచ్‌లకు శిక్షణ

నరసాపురం రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో మంగళ, బుధవారాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వీరభద్రరావు తెలిపారు. పరిపాలన, ఆర్థిక నిర్వహణ, అభివృద్ధి తదితర అంశాలపై రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు శిక్షణ ఉంటుంది.

గాయపడిన హోంగార్డు లక్ష్మణ్‌కు ఆర్థిక సాయం



హోంగార్డు లక్ష్మణ్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న డీఎస్పీ శ్రీవేద

నరసాపురం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టౌన్ స్టేషన్‌లో పని చేస్తున్న లక్ష్మణ్ విధి నిర్వహణలో ప్రమాదానికి గురయ్యాడు. లక్ష్మణ్ వైద్య ఖర్చుల నిమిత్తం టౌన్ పోలీసులు ఆర్థిక సాయం చేయాలని భావించారు. దానికి అనుగుణంగా రూ.60వేలు సేకరించారు.ఈ సాయాన్ని సోమవారం డీఎస్పీ శ్రీవేద చేతుల మీదుగా లక్ష్మణ్‌కు అందించారు.

పరిష్కార వేదికలో సమస్యలపై ఫిర్యాదులు

మొగల్తూరు, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి):మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నాలుగు ఫిర్యాదులు అందినట్టు డిప్యూటీ తహసీల్దార్ సుగుణ సంధ్య తెలిపారు. గొంతేరు డ్రెయిన్ తవ్వకాల్లో తాము కోల్పోయిన భూమికి నష్ట పరిహారం అందలేదని ముగ్గురు రైతులు, పంటబోదె మూసుకుపోవడంతో తమ భూములకు నీరందడం లేదని మొగల్తూరుకు చెందిన ఒక రైతు ఫిర్యాదు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి, ఈవోఆర్డీ నవీన్ కిరణ్, జేఈ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆకివీడు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐదు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీవో డి.బాబూరావు, తహసీల్దార్ ఫరూఖ్ తెలిపారు. మండలస్థాయి అధికారులు ఉన్నారు.

ఉరుములు, మెరుపుల వర్షం



ఆకుతీగపాడులో చెట్టుపై పడ్డ పిడుగు

పెంటపాడు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఆకుతీగపాడు గ్రామం ఊరు శివారులో పిడుగు పడింది. పొలాల మధ్య ఉన్న తాటి చెట్టుపై పడటంతో మంటలు అంటుకున్నాయి. అయితే వర్షం కురవడంతో మంటలు వాటికవే ఆరిపోయాయి. ఎవరూ లేని ప్రాంతంలో పిడుగు పడటంతో ఎవరికి ఎటువంటి నష్టం జరగలేదు. పెంటపాడులో ఉరుములు, మెరుపుల తో కురిసిన వర్షం కారణంగా విద్యుత్ ప్రసారానికి అంతరాయం కలిగింది. రాత్రి 9 గంటలకు తీసేసిన విద్యుత్ సోమవారం ఉదయం 7.30 గంటల వరకు పునరుద్ధరణ కాలేదు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని చోట్ల భారీ ఉరుములు, మెరుపులు కారణంగా ఇన్వర్టర్లు సైతం దెబ్బతిన్నాయి.

లయన్స్ క్లబ్ వితరణలు

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు లయన్స్ క్లబ్‌కు ఇంటర్నేషనల్ డైరెక్టర్ నందినీ ఖుషిల్ సోమవారం అధికారిక పర్యటనకు విచ్చేశారు. ఈసందర్భంగా ఆయనకు పాలకొల్లు క్లబ్ అధ్యక్షుడు శిడగం సతీష్, డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎన్‌వీవీఎస్ పాపారావు నాయుడు, సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా విద్యార్థులతో కలిసి ఆరోగ్య అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం లయన్స్ భవనంలో ఆర్థిక సహాయాలు చేశారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

నరసాపురం టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఊరటనిచ్చిందని టీడీపీ ఇన్‌చార్జి రామరాజు అన్నారు. సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో మత్స్యకార అభివృద్ధి చైర్మన్ కొల్లు పెద్దిరాజు, కూటమి నాయకులతో కలిసి జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించారు. దుకాణాలకు వెళ్లిన తగ్గిన వస్తువుల వివరాలను ఆరా తీశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, పాలూరి బాబ్జీ, కోటిపల్లి వెంకటేశ్వరావు, పొన్నాల నాగబాబు, నరేష్, కాగిత వెంకటేశ్వరావు, టి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మొగల్తూరు:పేరుపాలెం సౌత్‌లో టీడీపీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు పర్యటించి స్థానిక వ్యాపారులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో వస్తువుల ధరలను, ప్రస్తుత కూటమి పాలన ధరలను పోలుస్తూ నిత్యావసర సరుకులు, ఎలక్ట్రానిక్ వస్తువుల ధరల వివరాలు వ్యాపారుల నుంచి అడిగి తెలుసుకున్నారు.

తణుకు:జీఎస్టీ పన్ను వ్యవస్థ దేశ ఆర్థిక నిర్మాణంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని ఎస్వీఐఎం డిగ్రీకాలేజి ప్రిన్సిపాల్ సి.హెచ్. ఏడుకొండలు తెలిపారు. సోమవారం కాలేజీలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి ఎ.మాలతీదేవి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

ఆకివీడు రూరల్ అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత అన్నారు. దుంపగడపలోని వివిగిరి ప్రభుత్వ కళాశాలలో సీడీసీ సభ్యుల సహకారంతో కృత్రిమ మేధస్సుపై ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకుంటూ పోటీ ప్రపంచంలో ఎదగాలని అన్నారు. సాఫ్ట్‌వేర్ ట్రైనర్ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ యోగేశ్వరరావు పాల్గొన్నారు.